క్లుప్తంగా

గీత కార్మికులను ఆదుకుంటాం


గీత కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయికల్: గీతాకార్మికులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేటలో అగ్ని ప్రమాదంలో ఈత, తాటి వనాలు దగ్ధం కాగా ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన గీత కార్మికులతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన గీత కార్మికులను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహకారంతో న్యాయం చేస్తామన్నారు. రైతులు పంట పొలాల్లో వరి కొయ్యలు, గడ్డిని తగలబెట్టొద్దని, దీంతో పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, సర్పంచ్ గోపిస్వరూప, ఎంపీటీసీ సారిక, మండల కో ఆప్షన్ మెంబర్ ముకీద్, నాయకులు శ్రీనివాస్, తిరుపతిగౌడ్, వేణు, శంకరయ్య, తిరుపతి, గంగనర్సయ్య, పాల్గొన్నారు.

గీత కార్మికులకు సాయమందేలా కృషి


ఈతవనం పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: గీత కార్మికులకు సహాయం అందేలా చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని కిష్టంపేటలో కాలిపోయిన ఈత, తాటి వనాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదివారం పరిశీలించి మాట్లాడారు. బెల్టుషాపులతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. గీత కార్మికులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, తంగెళ్ల రమేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆది వారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న తరువాత బాల్య మిత్రులంతా ఒకచోట కలుసుకున్నారు. వారి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనాటి మరుపురాని మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. చదువు నేర్పిన గురువులు పరందాములు, నాగేశ్వర్, రామ్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి కలర్ టీవీ బహూకరణ


టీవీ బహూకరిస్తున్న రామేశ్వర్

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని అనాథ వృద్ధాశ్రమానికి కోటగిరి రామేశ్వర్ అనే రిటైర్డ్ ఉద్యోగి కలర్ టీవీని ఆదివారం ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్. హన్మాండ్లు, గౌరిశెట్టి హరీశ్, కాలగిరి బాపురెడ్డి, ఎల్లిమెల్ల సత్తయ్య, గిరి నాగభూషణం, జిడిగే పురుషోత్తం, పూటూరి గౌరీ శంకర్, ఎనుగుర్తి ప్రసాద్, కప్పల చంద్రమౌళి పాల్గొన్నారు.

'దమ్ముంటే నాతో చర్చకు సిద్ధం కావాలి'

కోరుట్ల: అభివృద్ధిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై చర్చకు రావాలని సవాల్ విసిరిన మంత్రి కొప్పుల ఈశ్వర్ దమ్ముంటే తనతో చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలో మాట్లాడుతూ రోళ్లవాగు ప్రాజెక్టులో ఎంతమంది రైతులు నష్టపోయారో చర్చకు రావాలని అదేవిధంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ఎంతమంది దళారులకు వత్తాసు పలికిండ్రో చర్చకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు.


వెంగళాయిపేటలో పోచమ్మ బోనాలు


కోరుట్ల రూరల్: చిన్నమెట్‌పల్లిలో బోనాలు


రాయికల్ మండలం కొత్తపేటలో బోనాలతో వస్తున్న మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేటలో ఆదివారం ఊరంతా పోచమ్మ బోనాల పండుగను వైభవంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచి సులోచన, ఎంపీటీసీ సుప్రియ, కుల సంఘాల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, బీమారం మండలం లింగంపేట గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కులసంఘాలవారీగా సామూహికంగా భోజనాలు చేశారు. ఉత్సవాల్లో సర్పంచ్ వంగ వెంకటేశం, నాయకులు కడారి వెంకటస్వామి, రాజేందర్, శేఖర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని సర్వాపూర్ పరిధి కొత్తపల్లి లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల గంగమ్మ, ఆకుల నగేశ్, పాక్స్ చైర్మన్ సాగర్ రావు, బీఆర్ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, ఇబ్రహీంపట్నం, గోధూర్, అమ్మక్కపేట గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలకు చేరుకుని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో సర్పంచ్ నేమూరి లత, దివ్య, సున్నం నవ్యశ్రీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుక వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చేతిపంపు మరమ్మతు చేయించేదెప్పుడో?



సారంగాపూర్: కేవలం రూ.2 వేలు వెచ్చించి బోరుకు మరమ్మతులు చేస్తే వందల మందికి తాగు నీరు అందుతుంది. జగిత్యాల నుంచి రేచపల్లి, భీమరెడ్డిగూడెం, మ్యాదారంతండా, లచ్చనాయక్‌తండా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని రేచపల్లి అటవీప్రాంతంలోని గండి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోరు చెడిపోయి చాలా రోజులవుతోంది. ఈ రోడ్డు గుండా రోజు వందలాది మంది వాహనదారులు ప్రయాణం కొనసాగిస్తారు. అటవీప్రాంతంలో రోడ్డు వెంట ఉండడంతో దీని మరమ్మతులు అత్యవసరంగా ఉన్నా, అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతు చేయించి తాగు నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని లింకురోడ్లు

- పలు మార్గాల్లో రోడ్లు గుంతలమయం
- కంకర తేలి వాహన చోదకులకు పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని పాలకులు
- గ్రామీణులకు తప్పని ఇబ్బందులు


మల్లాపూర్-సంగెం-శ్రీరాంపూర్ మార్గంలో కంకరతేలి అధ్వానంగా తయారైన లింకు రోడ్డు

మల్లాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో లింకు రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. రహదారులు గుంతలమయమై కంకరతేలి అధ్వానంగా తయారయ్యాయి. గత కొన్నేళ్లుగా వివిధ మార్గాల్లో తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతు పనులు భారీ వర్షాలకు దెబ్బతిని పూర్తిగా పాడవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మార్గాల్లో అడుగడుగుకు గుంతలతో ప్రయాణం నరకకూపంగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో రహదారుల మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గుంతలమయంగా రహదారులు

మల్లాపూర్-రేగుంట రహదారి విస్తరణ పనులకు రూ.13 కోట్లతో 2015 మార్చి 11న అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. 8 ఏళ్లయినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. అటవీప్రాంతంలో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జగిత్యాల నుంచి నిర్మల్ వెళ్లేందుకు ప్రధాన రహదారి ఇదే కావడంతో సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. మల్లాపూర్-మొగిలిపేట బీటీ రోడ్డు గత 13 ఏళ్లుగా పూర్తిగా గుంతలమయంగా మారినా.. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నిర్మించిన ఒబులాపూర్ తండా బీటీరోడ్డు పగుళ్లు ఏర్పడి తారు లేచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మల్లాపూర్-గుండంపల్లి, వేంపల్లి-రేగుంట, రత్నాపూర్-మొగిలిపేట, రత్నాపూర్-మల్లాపూర్ గ్రామాల మధ్య లింకు రోడ్ల నిర్మాణం చేపట్టినప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. మండల కేంద్రానికి వచ్చే సంగెం-శ్రీరాంపూర్ రోడ్డు కంకరతేలి అధ్వానంగా తయారైంది. ఇదే రోడ్డులో మోడల్ స్కూల్ ఉండడంతో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మట్టి రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

రోడ్డు నిర్మాణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు. దీంతో కొద్ది రోజుల్లోనే గుంతలు ఏర్పడి పలుచోట్ల తారు లేస్తోంది. ఇక ఏటా కురిసే వర్షాలకు రోడ్లు దెబ్బతిని పూర్తిగా పాడవుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు మరమ్మతుల పేరుతో పైపైనే తారుపూతలను చేసి వదిలేస్తున్నారు. దీంతో పెద్దగుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి లింకురోడ్లు, రహదారుల అభివృద్ధికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



మల్లాపూర్-మొగిలిపేట బీటీ రోడ్డు గత 14 ఏళ్లుగా గుంతలమయమై పాడై పోతోంది. వర్షాలకు పూర్తిగా దెబ్బతిని వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. రహదారి మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తిచేయాలి. - గొల్లపత్తిని గణేశ్, మొగిలిపేట

బీటీ రోడ్డును నిర్మించాలి



మల్లాపూర్ నుంచి సంగెం-శ్రీరాంపూర్ గ్రామానికి 20 ఏళ్ల కింద నిర్మించిన మట్టిరోడ్డును బీటీరోడ్డుగా మార్చాలి. ఈ రహదారిలో మోడల్‌స్కూల్ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రానికి వెళ్లే లింకురోడ్లను బీటీరోడ్లుగా మారిస్తే గ్రామీణ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. - ఎల్కా కమలాకర్, సంగెం - శ్రీరారంపూర్

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం


వెల్గటూర్‌లో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

వెల్గటూర్: రాష్ట్రంలో దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ రూ. 4016 లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్లూరి రాంచంద్రం, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, జూపాక కుమార్, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు బండమీది నరేశ్, దివ్యాంగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆల్క రాజేశం, దివ్యాంగులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: వికలాంగులకు పింఛన్ వెయ్యి రూపాయలు పెంచటంపై వికలాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని నాగులపేటలో వికలాంగులు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి, నాయకులు ఎండీ ఖయ్యూం, సుధాకర్, గణేష్, శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ధర్మపురి: బీసీ కులవృత్తుల ప్రోత్సాహక జాబితాలో మేరు కులస్తులను చేర్చినందుకు హర్షిస్తూ మేరు సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు రాపర్తి సత్తయ్య, నర్సింగరావ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లోనూ ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలేనా?


ఎంపీటీసీల ఊసేలేని సర్క్యులర్

సారంగాపూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం గ్రామాల్లో ఎంపీటీసీలకు గుర్తింపు ఇవ్వడం లేదు.ప్రజలతో గ్రామ స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో సర్పంచ్, కార్యదర్శి ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణ సాగుతుండగా, ప్రజలతో ఎన్నికైనా తమకు కనీసం ఈ ఉత్సవాల్లోనైనా ప్రభుత్వం సముచిత గౌరవం కల్పిస్తుందని భావించామని, కానీ ఎక్కడ కూడ లేదని పలువురు ఎంపీటీసీలు వాపోతున్నారు. గ్రామాల్లో ఎంపీటీసీల పాత్ర ఏమిటన్నది ఎవ్వరికీ అర్థం కాని ప్రశ్నగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం మండల పరిషత్‌లో జరిగే మండల సమావేశాల్లో తాము తీర్మానాలకే పరిమితమవుతున్నామని, గ్రామ పంచాయతీల్లో మా పాత్ర ఏమి లేకుండా పోయిందన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం నిర్వహించిన చెరువుల పండగ ఉత్సవాల్లో అన్ని గ్రామాల్లో ఘనంగా జరిగాయని, ప్రతి గ్రామంలో సర్పంచ్, గ్రామ కార్యదర్శి ప్రధాన భూమిక పోషించారని, తమకు కార్యదర్శులు ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారమే తప్ప మాకు ఎలాంటి ప్రత్యేక ఆహ్వానం కానీ, ఉత్సవాల్లో భాగస్వామ్యం లేకపోవడం ఈ పదవులు దేనికని వారు ప్రశ్నిస్తున్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 14న జరిగే మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెంబట్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ హాజరవుతారని పార్టీ బలోపేతానికి తీసుకునే చర్యలపై ప్రత్యేక చర్చ జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 9 ఏళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చిస్తారని, శక్తి కేంద్రాలు, బూత్ కమిటీల అధ్యక్షులు, వివిధ మోర్చా నాయకులు, కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దేల గంగరాజం, బీజేవైఎం మండలఅధ్యక్షుడు దీటి వెంకటేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మోదిగం మల్లేశం, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం రాయికల్ పట్టణ, మండల మోర్చాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14న జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ బలోపేతానికి, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడానికి చేపట్టే ప్రణాళికలు రూపొందించే విషయంపై విస్తృతంగా చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, రెంటం జగదీష్, కల్లెడ ధర్మపురి, చింత అనిల్,, గుర్రం రంజిత్ రెడ్డి ఆశన్న పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు జమ చేసేదెప్పుడు?

- కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం : రైతులు అమ్మిన ధాన్యం డబ్బులు ఇంకా ఎన్నాళ్లకు రైతుల ఖాతాల్లో జమ చేస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని వేములకుర్తిలో ఆదివారం మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి నెలరోజులైనా ఇంతవరకూ వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ. 1 లక్ష రుణమాఫీ హామీ అమలు అయ్యేది ఎప్పుడని ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాలు పక్కన పెట్టి రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నా .. స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పట్టించుకోవడం లేదని, దీనిని రైతులు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే వంట గ్యాస్ సిలిండర్ రూ. 500లకే అందిస్తామని , నిత్యావసర వస్తువుల ధరలు కూడా నియంత్రణలో ఉంటాయని తెలిపారు. రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీ మీద ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో రామనుజం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రన్‌ను విజయవంతం చేయాలి

వెల్గటూర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ధర్మపురి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై కొక్కుల శ్వేత కోరారు. సోమవారం ఉదయం 6 గంటలకు ధర్మపురి మండల కేంద్రంలోని నంది చౌరస్తా నుంచి తెలంగాణ రన్ ప్రారంభం కానుందని, ఈ రన్‌కు మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి మండలంలోని విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులు, ప్రజలు అందరు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.

1.34 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో 1,34,297 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆదివారం తెలిపారు. సహకార సంఘం పరిధిలో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భూషణరావుపేటలో 18,344 క్వింటాళ్లు, దుంపేటలో 11,656 క్వింటాళ్లు, ఇప్పపెల్లిలో 9,398 క్వింటాళ్లు, కలిగోటలో 12,557 క్వింటాళ్లు, పోసానిపేటలో 11,904 క్వింటాళ్లు, దూలూర్‌లో 7,147 క్వింటాళ్లు, అంబారిపేలో 9,773 క్వింటాళ్లు, పెగ్గెర్లలో 7,811 క్వింటాళ్లు, కథలాపూర్‌లో 14,290 క్వింటాళ్లు, చింతకుంటలో 17,022 క్వింటాళ్లు, రాజారాం తండాలో 5,011 క్వింటాళ్లు, ఊట్‌పెల్లిలో 9,380 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. రూ. 27.66 కోట్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

పలువురికి మంత్రి, ఎంపీ పరామర్శ

ధర్మపురి : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరిని ఆదివారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి ఎంపీ బోర్లకుంట వేంకటేశ్ నేత పరామర్శించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో వేదపండితులుగా విధులు నిర్వహిస్తున్న బొజ్జ రమేశ్, ధర్మపురికి చెందిన చీర్నేని నర్సయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, మంత్రి,ఎంపీ పరామర్శించారు. వారి వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు ఉన్నారు.

విద్యార్థుల చదువుకు వాకర్స్ చేయూత

జగిత్యాలటౌన్: నిరుపేద చిన్నారులకు నాణ్యమైన చదువు అందిస్తున్న వాల్మీకి ఆవాసానికి ధరూర్ క్యాంపు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ 51,116 విరాళం అందించారు. సేవాభారతి ఆధ్వర్యంలో పట్టణంలోని ధరూర్ క్యాంపులో నిర్వహించే వాల్మీకి ఆవాసం నూతన భవన నిర్మాణానికి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విరాళం అందించి దాతృత్వం చాటుకున్నారు. నిరుపేద గ్రామీణ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ఆవాసం నిర్వాహకులు, సిబ్బందిని వాకర్స్ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఆవాసం భవన నిర్మాణ కమిటీ సభ్యులు భీమనాతి శంకర్, జిడిగె పురుషోత్తం, సంపూర్ణచారి,చిత్తారి మధుకర్, గౌరిశెట్టి హరీశ్, ఆవాస ప్రముఖ్ మల్లేశం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు,కొత్త ప్రభాకర్, రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

జగిత్యాలరూరల్: నిరుపేద యువతి వివాహానికి రూ.55,532 ఆర్థికసాయం అందించి కల్లెడ గ్రామస్తులు ఔదార్యాన్ని చాటుకున్నారు. కల్లెడ గ్రామానికి చెందిన సుద్దాల భీమయ్య, రాజవ్వ దంపతుల కుమార్తె జల వివాహం త్వరలో కానుంది. యువతి తండ్రి మృతిచెందగా, తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో జల వివాహానికి ఆదివారం ఎంపీటీసీ పరుశురాంగౌడ్ రూ 11, 116, గంగం మధు రూ. 5 వేలు, అంకతి సురేశ్ రూ. 3 వేలు, మరికొంతమంది రూ 12 వేలు, మంచిర్యాలకు చెందిన రవీందర్ రూ 10, 300 విలువ గల పుస్తెమెట్టెలు, ఖర్చులకు రూ 5 వేలు, పార్వతి పరమేశ్వర సేవా సమతి రూ. 9,116 మొత్తం రూ.55, 332 కుటుంబానికి అందజేశారు.

కరాటే బెల్ట్, సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లతో విద్యార్థులు

కోరుట్లటౌన్: పట్టణంలోని ఒకినావో స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం బెల్టులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరాటే చీఫ్ ఎగ్జామినర్ వసంత్ కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే మాస్టర్ అల్లె రమేశ్ 23 ఏళ్లుగా సుమారు 600 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం వేసవి శిక్షణ పూర్తి చేసిన 60 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కటుకం జగదీశ్వర్, ఇల్లుటపు నర్సయ్య, రమణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.